క్లుప్తంగా

బాలికలకు దుస్తుల పంపిణీ


విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేస్తున్న స్పందన సంస్థ కోఆర్డినేటర్ శ్యామల

శ్రీరంగరాజపురం : మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు స్పందన సంస్థ ద్వారా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పందన సంస్థ కో–ఆర్డినేటర్ శ్యామల మాట్లాడుతూ గత రెండు దశాబ్దం నుంచి జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు విద్యాసామగ్రితో పాటు రెండు జతల యూనిఫాం అందిస్తామన్నారు. సంస్థ వ్యవస్థాపకులు లంకపల్లి గిరిప్రసాద్(కాలిఫోర్నియా) ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉన్నతవిద్య కోసం ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నేడు అందరికీ రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న విద్యాకానుక పథకం ద్వారా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ పథకాన్ని జూనియర్ కళాశాలలో కూడా వర్తింపజేయాలన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న పథకాలు అమెరికాలోని ప్రజలు ప్రశంసిస్తున్నారని తెలిపారు. అనంతరం పాఠశాల హెచ్ఎం శాంతి మాట్లాడుతూ స్పందన సంస్థ సేవలు విద్యార్థులకు ఓ వరం లాంటిదన్నారు. శ్యామల రచించిన సాహిత్యం 'జీవన సౌరభాలు' అనే శతక పద్యాలను సైతం రచించి, అభినవ వేమనగా ప్రజలను జాగృతి పరుస్తోందని అన్నారు. ఉపాధ్యాయులు బండి ప్రభకర్‌రెడ్డి, రెడ్డెప్ప నాయుడు, షణ్ముగం, హేమలత, లావణ్య, మాధవి, శ్రీనివాసులు, గోవర్ధన్, గాయత్రి, ధనుంజయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నగరి : వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్ర అధ్యక్షతన ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ పంచాయతీ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులకు బకాయి ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ నాయకులు వేలన్, బాష, మురళి, గ్రీన్ అంబాసిడర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం పాల్గొన్నారు.

చెత్త సేకరణపై శ్రద్ధ పెట్టండి

పాలసముద్రం : గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా గ్రీన్ అంబాసిడర్లు తడి, పొడి చెత్తను సేకరించాలని తహసీల్దార్ బాబు తెలిపారు. సోమవారం ఆయన శ్రీకావేరిరాజుపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సర్పంచ్ గాలి మహేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి యశ్వంత్‌తో కలసి పర్యటించారు. గ్రీన్ అంబాసిడర్లతో ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తీరుతుందన్నారు. అలాగే ప్రతి ఇంటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్త సంపద కేంద్రాలకు తరలించి, అందులో వానపాములు వదలాలని సూచించారు. తయారైన ఎరువును రైతులకు తక్కువ ధరకు కేజీల ప్రకారం విక్రయించి పంచాయతీకి ఆదాయం పెంచుకోవాలన్నారు. అనంతరం శ్రీకావేరిరాజుపురంలో వీధుల్లో పరిసరాలు శుభ్రంగా ఉండడంపై సంతృప్తి చెందారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూస్ ఏఈ హిమంత్ కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అక్షయ్ పాల్గొన్నారు.

అమృత్ సరోవర్‌తో భూగర్భజలాలు పెంపు

పాలసముద్రం : ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపడుతున్న అమృత్ సరోవర్‌లో భాగంగా నీటి కుంటలు తవ్వడం వల్ల భూగర్భజలాలు పెంపొందుతుందని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏపీఓ మార్గరేట్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ మాట్లాడుతూ అమృత్ సరోవర్‌లో భాగంగా నీటి కుంటలు తవ్వడం వల్ల ఆ మట్టిని రైతుల భూముల్లో చల్లితే భూసారం పెరుగుతుందన్నారు. ఉపాధిహామీ పథకంలో చేస్తున్న పనులు నాణ్యతగా చేయాలని సూచించారు. కూలీల హాజరు మస్టర్‌ను కొట్టివేతలు లేకుండా నమోదు చేయాల్సిన బాధ్యత ఫీల్డ్‌అసిస్టెంట్లపై ఉందన్నారు. మేట్లు పనులు చేస్తున్న కూలీల ఫొటోలను రెండు పూట్ల ఆన్‌లైన్‌లో పెట్టాలని, అప్పుడే వారికి సక్రమంగా బిల్లులు వస్తాయన్నారు. కార్యక్రమంలో జేఈ అనుషా, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ వితరణ

కార్వేటినగరం: మండలకేంద్రంలోని స్థానిక యహోవా ఈరే చర్చిలో పాస్టర్ అగస్టీన్ సరోజిని సోమవారం వికలాంగుడికి వీల్‌చైర్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు పాల్ రవికుమార్ 3వ వర్ధంతి సందర్భంగా పద్మసరస్సు గ్రామానికి చెందిన వికలాంగుడు రాజుకు వీల్‌చైర్ అందించినట్లు తెలిపారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

- ఇటీవల జరిగిన ఉప ఎన్నికలు చంద్రబాబుకు చెంపపెట్టు
- గ్రామాల్లో ప్రజలు ఆనందంగా ఉన్నారు
- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని గజమాలతో సత్కరిస్తున్న రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్, వైఎస్సార్‌సీపీ నాయకులు


మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చుతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని గంగుపల్లి సచివాలయ పరిధిలోని గంగుపల్లి, గంగుపల్లి అరుంధతివాడ, శెట్టివారిపల్లి, సన్యాసపల్లి, భాస్కరరావు పురం, కుప్పనపల్లి, జలకంఠాపురం, చెరువుముందర ఊరు, గుత్తావాళ్లఊరు, వడ్డిపల్లి బీసీ కాలనీ, గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రతి ఇంటా కర్పూర నీరాజనాలతో, గజమాలలతో సత్కరిస్తూ పూలవర్షం కురిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులకు మాత్రమే మేలు జరిగిందని, నేడు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాలు అందుతున్నాయని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక కులమతాలు, వర్గాలు చూడకుండా పథకాలు అందిస్తున్నారని, ఆ ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సంక్షేమాలకు ఆకర్షితులైన ప్రజలు ఉప ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా టీడీపీ గల్లంతు ఖాయమన్నారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా నవరత్నాల పథకాలను అందించి జగనన్న అందిస్తున్నారని తెలిపారు. గుర్రం గుగ్గిళ్లు తింటే గాడిదకు కడుపు ఉబ్బరం వచ్చిందన్న చందాన ప్రజలంతా సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉంటే చూసి ఓర్చుకోలేని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కొండను చూసి కుక్కలు మొరిగినట్లు ఎంత గట్టిగా అరిచినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు. అదేవిధంగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రతి గడపలో కూడా తనకు మంగళహారతులు పట్టి, గజమాలలతో ఘనంగా సన్మానించడమే కాకుండా పూలవర్షం కురిపించి స్వాగతిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం కేపీ వడ్డిపల్లి గ్రామంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్ ఉప ముఖ్యమంత్రిని క్రేన్ ద్వారా గజమాలతో ఘనంగా సన్మానించారు.

ఇలాంటి పథకాలు అందించలేదు..

గంగుపల్లి గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు 67 ఏళ్లు తనకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి చూస్తున్నానని, ఎన్నో ప్రభుత్వాలు మారాయని, కానీ గత పాలకులు వారి స్వార్థాన్ని చూసుకున్నారని తెలిపారు. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాలుగు సంవత్సరాల్లో ప్రతి ఇంటికీ సంక్షేమాలు అందించి ప్రజల గుండెల్లో నిలిచిపోతున్నారని, తాము ఎప్పుడూ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి స్పందిస్తూ ఇలాంటి అభిమానులు ఉన్నంత వరకు జగనన్నే సీఎం అవుతారని అన్నారు. సర్పంచ్ అరుణ, మండల పార్టీ కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, నాయకులు కృష్ణారెడ్డి, నీలాపండరీనాథ్, దాము, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

నారయ్య కుటుంబానికి పరామర్శ..

గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని బాలగంగనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ గోవిందన్ తండ్రి నారయ్య(65) అకాలమృతి చెందారు. సమాచారం అందుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గ్రామానికి వెళ్లి నారయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన వారి కుటుంబాన్ని ఓదార్చారు. మంత్రి వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ చిన్నమరెడ్డి, సర్పంచ్ శేఖర్, వింజం సర్పంచ్ గోవిందన్ ఉన్నారు.



ఘనంగా మాతమ్మ కొలుపు


పురవీధుల్లో దర్శనమిస్తున్న మాతమ్మ దేవత

కార్వేటినగరం: మండల పరిధిలోని బంద్రేవు కాలనీలో సోమవారం మాతమ్మ కొలుపు వేడుకలను వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి ప్రత్యేక వాయిద్యాల నడుమ, బాణసంచా పేలుళ్లతో పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. స్థానిక ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనుంజయవర్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

పాలసముదం : ప్రకృతి సేద్యంలో రైతులు సేంద్రియ ఎరువులు వాడడం వల్ల పంటలు అధిక దిగుబడి వస్తాయని డీపీఎం వాసు తెలిపారు. సోమవారం ఆయన ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ఉపయోగాలను తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో వరిసాగు చేసి, ఆ బియ్యాన్ని తింటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామన్నారు. సర్పంచ్ మహేష్‌బాబు, రైతులు ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చెరుకు బకాయిలు చెల్లించండి


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

- చెరుకు తోలిన రైతులకు రూ.36 కోట్లు బకాయిలు
- నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోండి
- చర్యలు తీసుకోవాలని చెరుకు రైతులు


రైతులతో మాట్లాడుతున్న సీఐ, తహసీల్దార్

నింద్ర: మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెరుకు సరఫరా చేసిన రైతులకు ఇవ్వవలసిన బకాయిలు రూ.36 కోట్లు ఇవ్వాలని కోరుతూ చెరుకు రైతులు సోమవారం చెన్నై–తిరుపతి జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేతాజీ రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ చెరుకు సరఫరా చేసి నాలుగేళ్లు గడుస్తున్నా రైతులకు బకాయిలు చెల్లించకుండా యాజమాన్యం మొండి వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరుకు సరఫరా చేసిన నెల రోజుల్లోనే రైతులకు డబ్బులు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వకపోవడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కూడా రైతులకు బకాయిలు చెల్లించాలని కోరుతూ పలుమార్లు ఆందోళన చేసినా, న్యాయం జరగలేదన్నారు. స్థానిక అధికారులు కూడా రైతుల సమస్య పరిష్కరిస్తామని చెప్పి స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నిరసన చేస్తున్న విషయం తెలిసి స్థానిక తహసీల్దార్ అమరేంద్రబాబు, నగరి రూరల్ సీఐ శ్రీనువాసంతి వెళ్లి రైతులతో చర్చించారు. జిల్లా కేన్ అసిస్టెంట్ కమిషనర్‌ను విధుల నుంచి తొలగించాలని, తక్షణం తమకు బకాయిలు చెల్లించేలా షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి సమస్య పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని స్థానిక అధికారులు జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌లో వివరించారు. అనంతరం వారు రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఆర్ఆర్ నోటీసులు ఇవ్వడం జరిగిందని అధికారులు తెలిపారు. పది రోజుల్లో సమస్య పరిష్కరించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఆదినారాయణ రెడ్డి, రఘునాథరెడ్డి, సుదర్శన్ నాయుడు, నాగభూషణం నాయుడు, జనార్ధన్ యాదవ్, రైతులు రమేష్‌రెడ్డి, లక్ష్మణరాజు, ప్రకాష్‌నాయుడు, గుణశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్న వస్తున్నాడు..

- సంబరాలు అంబరాన్నంటాలి
- 28న నగరిలో సీఎం జగన్ పర్యటన
- నియోజకవర్గ నాయకులతో సమీక్షలో మంత్రి ఆర్‌కే రోజా


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కే రోజా

నగరి : నగరి పట్టణానికి జగనన్న వస్తున్నారని సంబరాలు అంబరాన్ని అంటాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పుత్తూరు మున్సిపాలిటీ, పుత్తూరు మండలం, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన పార్టీ శ్రేణులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన జగనన్న విద్యాదీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నగరి పట్టణానికి విచ్చేస్తున్నారన్నారు. ప్రజల కోసం పార్టీని స్థాపించి మనకు వెన్నుదన్నుగా నిలబడిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. దేశస్థాయిలో రాష్ట్రప్రగతి పతాకాన్ని ఎగురవేసిన మన నాయకుడు, రాష్ట్రంతో పాటు పార్టీకి కూడా కీర్తి ప్రతిష్టలు చేకూర్చి నేడు ప్రతి కార్యకర్త నేను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వాడినని గర్వంగా చెప్పుకునేలా పాలిస్తున్న మన ముఖ్యమంత్రి, సంక్షేమ ఆంధ్రప్రదేశ్ సృష్టికర్త అయిన జగనన్న నియోజకవర్గానికి విచ్చేస్తున్నారంటే అది మనకు పండుగ రోజన్నారు. ఆయన సమావేశానికి హాజరయ్యే అవకాశాన్ని ఎక్కువమంది ప్రజలకు కల్పించాలని సూచించారు. పక్కా ప్రణాళిక ప్రకారం ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా సమావేశానికి వచ్చే అవకాశాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి, పుత్తూరు మున్సిపల్, పుత్తూరు, విజయపురం, నింద్ర మండలాల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పోలాక్షమ్మ ఆలయంలో వివక్ష లేదు

- ఆలయం లోపల నుంచే స్పష్టం చేసిన దళితులు
- వాస్తవ పరిస్థితులు నమోదు


పోలాక్షమ్మ ఆలయంలో మాట్లాడుతున్న దళితులు

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని రామకృష్ణాపురం (గొల్లపల్లి)లోని పోలాక్షమ్మ ఆలయంలో వివక్షకు తావేలేదని దళితులు స్పష్టం చేశారు. సోమవారం ఆలయం లోపల నుంచి దళితులు మాట్లాడుతూ ఉత్సవాల్లో తామంతా పాల్గొంటున్నామని చెప్పారు. తమకు ఆలయంలో ప్రవేశం లేదని కొందరు ప్యాకేజీ నాయకులు మీడియాను సైతం తప్పుదారి పట్టిస్తున్నారని తెలిపారు. ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. తాము పొంగళ్లు పెట్టుకుంటున్నామని, అమ్మవారిని కొలుస్తున్నామని చెప్పారు. చుట్టుపక్కల 7 గ్రామాల రైతులు తమను సొంత మనుషుల్లా చూస్తున్నారని వెల్లడించారు.

అంతర్గత కలహాలే కారణం..

ఆలయ ధర్మకర్త శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రామకృష్ణాపురం దళితవాడలో అంతర్గత కలహాలే వివాదానికి కారణమని తహసీల్దార్ పరమేశ్వర స్వామి వద్ద వాగ్మూలం ఇచ్చారు. ఆలయ పూజారి ఈశ్వరమ్మ(55) ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆలయానికి తాళం వేసి సమీపంలోని గ్రామ రైతు భాస్కర్‌రెడ్డి ఇంట్లో భోజనం చేసి అక్కడే నిద్రపోయిందన్నారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో దళితవాడకు చెందిన 20 మంది పొంగళ్లు పెట్టుకోవడానికి ఆలయానికి వచ్చారని, ఇదే సమయంలో తమని ఆలయంలోకి ప్రవేశించకుండా కావాలనే తాళం వేశారని అపోహపడ్డారని తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పూజారిని పిలిపించి ఆలయ తాళాలు తెరవగా పొంగళ్లు పెట్టుకుని, అమ్మవారిని దర్శించుకున్నారని, అయితే కొందరు దురుద్దేశంతో దళితులకు ఆలయ ప్రవేశం లేకుండా చేశారనడం అవాస్తవమన్నారు. దీనిపై గ్రామంలో అంతా ఆల య ప్రవేశంపై ఎలాంటి ఆక్షేపణలు చేయరాదని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా అంతా కలిసి ఉండాలని తీర్మానం చేశారు. ఈమేరకు తహసీల్దార్ వారి వాంగ్మూలాన్ని రికార్డు చేసుకున్నారు.

హ్యాపీ మ్యారేజ్ డే మేడమ్..




భర్త సెల్వమణికి కేక్ తినిపిస్తున్న మంత్రి రోజా

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, ఆర్కే సెల్వమణి దంపతులు తమ వివాహ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సంబరాల్లో నియోజకవర్గ నాయకులు పాల్గొని మంత్రి రోజా దంపతులతో పెళ్లిరోజు సందర్భంగా కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా రోజా, సెల్వమణి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. - నగరి

అవకాశాలను అందిపుచ్చుకోవాలి


స్మార్ట్‌టీవీలో బోధనను పరిశీలిస్తున్న ఎంఈఓ

నగరి : అవకాశాలను అందిపుచ్చుకుని చదువులో బాగా రాణించాలని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. సోమవారం మండలంలోని మిట్టపాళెం ప్రాథమిక స్కూల్‌ను తనిఖీ చేశారు. స్మార్ట్ టీవీ ద్వారా ఇంగ్లీషు పాఠాలను బోధిస్తున్న విధానాన్ని ఆమె పరిశీలించి ఉపాధ్యాయురాలిని ప్రశంసించారు. విద్యా విధానంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, సులభమైన రీతిలో బోధించే ఇలాంటి అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. తద్వారా చదువులో బాగా రాణించాలని ఎంఈఓ విద్యార్థులకు సూచించారు.

